

గంగాధర: వెంకటాయపల్లిలో మటన్ సెంటర్ నిర్వాహకుడిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



గంగాధర: లక్ష్మీదేవిపల్లిలో వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# జోరుగా బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం



చొప్పదండి: ఏడో వార్డులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, నాయకులు

- **బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి**

చొప్పదండి, నవంబర్ 19: చొప్పదండి పట్టణంలోని ఏడో వార్డులో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి సుంకె రవిశంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర, నవంబర్ 19: మండలంలోని వెంకటాయపల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఇక్కడ ఉపసర్పంచ్ వేముల శ్రీధర్, నాయకులు తాళ్ల రవి, పొన్నం పరశురాములు, రాంరెడ్డి, జలందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నాయకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మల్యాల, నవంబర్ 19: మండలంలోని మానాల గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆదివారం గంగాధర మండలం బూరుగుపల్లిలోని నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే, సుమారు 120 మంది యూత్ సభ్యులు ఎమ్మార్పీఎస్ నాయకులు నలువాల సంజీవ్, వేణు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. జడ్పీటీసీ కొండపలుకుల రామ్మోహన్ రావు, పార్టీ మండలాధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, నాయకులు నెల్ల రాజేశ్వర్ రెడ్డి, నలువాల బుచ్చయ్య, ఎడిపెల్లి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్

గంగాధర, నవంబర్ 19: అక్రమంగా గంజాయి తరలిస్తున్న యువకుడిని అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ రవీందర్ తెలిపారు. ఆదివారం గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలానికి చెందిన మర్రి బాలనాగ దుర్గశ్రీ నవీన్ అనే యువకుడు అక్రమంగా గంజాయి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గంగాధర వద్ద ఎస్ఐ పుల్ల అభిలాష్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన బాలనాగ దుర్గశ్రీ నవీన్‌ను పట్టుకుని విచారించగా గంజాయి తరలిస్తున్నట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. బాలనాగ దుర్గశ్రీ నవీన్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ. 40 వేల విలువైన 1600 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ అభిలాష్, పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

## విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

### అర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



బాధితురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల, నవంబర్ 19: మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో ఆదివారం ఉదయం ఓ ఇల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కవిత కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నది. కాగా, గ్రామానికి చెందిన ఎండ్ల శ్రీను ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆదివారం ఉదయం ఇంటి ఎదుట పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా ఇంట్లో నుంచి మంటలు చెలరేగాయి. స్థానికులు నీళ్లు తెచ్చి మంటలను అర్పివేశారు. ఇంట్లో మహిళా సంఘానికి సంబంధించిన రూ. 50 వేల నగదుతో పాటు సామగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. సుమారు రూ. లక్షా 50 వేల నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వెళ్లి పరిశీలించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకొని రూ. 10 వేల నగదుతో పాటు నిత్యావసర వస్తువులు, దుస్తులు అందచేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మెన్నేని స్వర్ణలత, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, ఎమ్మెల్యే సతీమణి దీవెన, వైస్ ఎంపీపీ ప్రసాద్, ఎంపీటీసీ సామల్ల లక్ష్మణ్, కోఆప్షన్ సభ్యులు నసీరొద్దీన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశం, నాయకులు ఏలేటి నర్సింహారెడ్డి, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, కాయిత రాజు, నేరెళ్ల మహేశ్, రాచకొండ చంద్, మాంకాళి గంగయ్య, తదితరులున్నారు.

## ఆలయానికి విరాళం

కొడిమ్యాల, నవంబర్ 19: మండల కేంద్రంలో చేపడుతున్న శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి నాచుపల్లి గ్రామానికి చెందిన బోడ్ల గణేశ్ –శ్రీలత దంపతులు రూ. 25,116 విరాళంగా అందజేశారు. నగదును ఆలయ పూజారి నాగరాజు రమేశ్‌కు ఇచ్చారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

# కాంగ్రెస్‌లో కార్యకర్తలకు గుర్తింపు లేదు




మాట్లాడుతున్న నాగి శేఖర్

- **20 ఏళ్లుగా పార్టీ కోసం పని చేసినా గుర్తించలేదు**
- **మేడిపల్లి సత్యం నోరు అదుపులో పెట్టుకోవాలి**
- **బీఆర్ఎస్ నాయకుడు నాగి శేఖర్**

గంగాధర, నవంబర్ 18: 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం అలుపెరుగకుండా పని చేసినా అధినాయకత్వం తనను గుర్తించలేదని, కాంగ్రెస్‌లో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు లేదని బీఆర్ఎస్ నాయకుడు నాగి శేఖర్ పేర్కొన్నారు. గంగాధర మండలం మధురానగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌పై కాంగ్రెస్ నాయకుడు మేడిపల్లి సత్యం అసత్యపు ఆరోపణలు చేస్తున్నాడని, నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. లేదంటే గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించాడు. రవిశంకర్‌ను తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. చొప్పదండిలో కాంగ్రెస్ పార్టీ స్థానికేతరుడికి టికెట్ కేటాయించిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచులు వేముల లావణ్య–అంజి, మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, ఎంపీటీసీ ద్యావ మధుసూదన్‌రెడ్డి, నాయకులు రామిడి సురేందర్, బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, వాసాల గంగాధర్, వడ్లూరి ఆదిమల్లు, మడ్లపెల్లి రమేశ్, సుంకె అనిల్, సముద్రాల అజయ్, ఎండీ అబ్బాస్, నల్ల నరోత్తంరెడ్డి, ఇరుగురాల రవి, తూం తిరుపతి, సముద్రాల ఓంకార్, ద్యావ సంజీవ్, శనిగరపు వెంకటేశ్, గంగాధర మోహన్, గంగాధర నగేశ్, జక్కుల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

గంగాధర, నవంబర్ 19: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన కోల రాధ, దూస సతీశ్, కొలెపాక లక్ష్మణ్, మంజుల దంపతుల కుమారుడు బాబు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను ఆదివారం నాయకుడు తూడి లచ్చయ్య యువసేన సభ్యులు పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున నగదు, 25 కిలోల బియ్యం పంపించగా, అందజేశారు. తూడి లచ్చయ్యకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న తూడి లచ్చయ్య యువసేన సభ్యులు

## ఆడబిడ్డలకు అండగా మా ఊరి మహాలక్ష్మి ఫౌండేషన్



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గంగాధర, నవంబర్ 19: కొండాయపల్లి గ్రామంలో పుట్టిన ఆడపిల్లకు మా ఊరి మహాలక్ష్మి ట్రస్ట్ అండగా ఉంటుందని వ్యవస్థాపక అధ్యక్షుడు రేండ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామంలో 2022లో జన్మించిన 10 మంది ఆడపిల్లలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేలు, తల్లిదండ్రుల సహకారంతో రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేలు సుకన్య సమృద్ధి యోజన ద్వారా పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కాగా, ఆదివారం డిపాజిట్ పత్రాలను తల్లిదండ్రులకు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రేండ్ల శ్రీనివాస్, అధ్యక్షురాలు పద్మ అందజేశారు. 2018లో ఫౌండేషన్‌ను ప్రారంభించి 49 మంది ఆడపిల్లల పేరిట రూ.5 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన నలుగురు ఆడపిల్లలకు, తెలంగాణలో తండ్రిని కోల్పోయిన 15 మంది బాలికల పేరిట కూడా రూ. 5 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు చెప్పారు. కాగా ఫౌండేషన్ సభ్యులకు చిన్నారుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ ఫౌండేషన్ అధ్యక్షురాలు గోవిందమ్మ, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.